ప్రయాణం.. ప్రమాదం

- ప్రమాదకర మలుపులతో అవస్థలు
- రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు
- మోరంపూడి – శాటిలైట్ సిటీ రోడ్డు దుస్థితి



వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పిట్లవానిచెరువు వైపునకు వచ్చే దారిలో మలుపు

రాజమహేంద్రవరం రూరల్: ఆ రోడ్డులోని ప్రమాదకర మలుపులు ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. రోజూ వందల వాహనాలు రయ్‌రయ్ అంటూ శరవేగంతో దూసుకుపోతున్నా.. కనీసం హెచ్చరిక బోర్డులు సైతం కనిపించడం లేదు. రోడ్డును ఇరువైపులా పిచ్చి మొక్కలు కప్పేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మోరంపూడి నుంచి శాటిలైట్ సిటీకి వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు దుస్థితి ఇది. వివరాల్లోకి వెళితే. శాటిలైట్ సిటీ నుంచి మోరంపూడి రోడ్డు వరకు సుమారు ఆరు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ప్రతి రోజు వందల మంది వాహన చోదకులు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోలు, లారీలు, బైకులు రయ్‌రయ్ మంటూ వెళుతుంటాయి. ఇలా మలుపులు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.



పిట్లవానిచెరువు వద్ద మొక్కల మధ్య సూచిక బోర్డు

తరచూ ప్రమాదాలే..



శాటిలైట్ సిటీ నుంచి మోరంపూడికి వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డులోని మలుపులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాటు సూచిక బోర్డులు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– బత్తిన అప్పారావు, శాటిలైట్ సిటీ

కానరాని బోర్డులు

ఈ ఆర్అండ్‌బీ రోడ్డులో పిట్లవానిచెరువు వద్ద ఒక చోట మాత్రమే ఒక సూచిక బోర్డు దర్శనమిస్తోంది. మిగిలిన ప్రదేశాలలో ఎక్కడా అవి కనిపించవు. కేవలం రోడ్డుపై వైట్ మార్కులు మాత్రమే ఉన్నాయి. సూచిక బోర్డులు లేకపోవడం వలన వాహన చోదకులు వేగంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

పిచ్చిమొక్కలతో ప్రమాదం

ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనివల్ల రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి మలుపులు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించాలని కోరుతున్నారు.



పిట్లవానిచెరువు వద్ద ప్రమాదకర మలుపు



శాటిలైట్ సిటీ రోడ్డులో మలుపు వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు



శాటిలైట్ సిటీ వద్ద ప్రమాదకరంగా..

నానో ఎరువులపై అవగాహన అవసరం



అభ్యుదయ రైతులను సత్కరిస్తున్న వ్యవసాయాధికారి మాధవరావు తదితరులు

సీటీఆర్ఐ: నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అభ్యుదయ రైతులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాధవ రావు మాట్లాడుతూ గత రెండు సీజన్లలో రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం మండలాలకు చెందిన అభ్యుదయ రైతులు నానో ఎరువుల వినియోగం ద్వారా మంచి ఫలితాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో వారికి సన్మానం చేశామన్నారు. అవసరానికి మించి యూరియా వాడటం వలన నేల సహజ స్వభావం దెబ్బతింటుందన్నారు. నానో యూరియా, నానో డీఏపీ వాడకం పంట పెరుగుదలకు దోహద పడుతుందని వివరించారు. కార్యక్రమంలో తొర్రేడు మండలానికి చెందిన అభ్యుదయ రైతులు సుంకవల్లి చౌదరి, ఎస్‌వీవీ శ్రీనివాస్, చినకొండేపూడికి చెందిన జి.నాగరాజు, కె.సతీష్‌లను సన్మానించారు.

స్పా సెంటర్‌పై దాడి



దాడి వివరాలను చెబుతున్న సీఐ బాజీలాల్

కంబాలచెరువు: స్పా ముసుగులో వ్యభిచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రకాశ్‌నగర్ సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ తెలిపారు. ఏవీ రోడ్డులోని ఫెదర్ టచ్ స్పాపై చేసిన దాడి వివరాలను సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరించారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ ఆదేశాల మేరకు స్పా సెంటర్‌పై దాడి చేయగా, అక్కడ ముగ్గురు నిర్వాహకులు, నలుగురు విటులు, ఐదుగురు బాధిత మహిళలను పట్టుకున్నామన్నారు.

వసతి గృహాల పరిశీలన

కంబాలచెరువు: స్థానిక వుమెన్స్ కళాశాల సమీపంలోని బాలికాసదానం ప్రభుత్వ చిల్డ్రన్ వసతి గృహాన్ని, బాలాజీపేటలోని ఏకలవ్య చిల్డ్రన్ ఫర్ బాలుర వసతి గృహాన్ని సోమవారం డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లలు జాగ్రత్తగా ఉండాలని, తమ హద్దులు దాటి ప్రవర్తించరాదన్నారు. విద్యార్థులకు సురక్షిత తాగునీరు, మంచి ఆహారం అందించడంతో పాటు వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. వసతి గృహాలలో ఎటువంటి సమస్యలున్నా, న్యాయ సహాయం అవసరమైనా నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. విద్యార్థుల హక్కులను రక్షించడానికి న్యాయసేవాధికార సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు.



వసతి గృహం పిల్లలతో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

మహిళల కిక్ బాక్సింగ్‌లో పతకాలు

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలోని బాక్సింగ్ హాల్లో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా మహిళల కిక్ బాక్సింగ్ పోటీల్లో బొమ్మూరు శ్రీమారుతి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఎం.సహాన బంగారు, దిల్వాస్ సాహే రజత, ఎం.రిషిత రజిత, కాంస్య, కె.పూర్ణిమ స్వర్ణ, కాంస్య పతాకాలు సాధించారు. వారిని, కిక్ బాక్సింగ్ జిల్లా ప్రెసిడెంట్ ఎం.గణేష్, సెక్రటరీ, రిఫరీగా వ్యవహరించిన ఎన్.గిరి వెంకటరమణ, కోశాధికారి ఎం.భవానీశంకర్‌లను రాష్ట్ర ప్రెసిడెంట్, ఆర్గనైజర్ జి.ఆనందబాలు, విశాఖ ప్రెసిడెంట్ జోగారావు, సెక్రటరీ సంతోష్‌కుమార్ అభినందించారు.



కిక్ బాక్సింగ్‌లో విజేతలుగా నిలిచిన బొమ్మూరు అకాడమీ విద్యార్థినులు

కెనాల్ రోడ్డుకు శంకుస్థాపన

కడియం: కడియం నుంచి జేగురుపాడు వరకూ నాబార్డు నిధులు రూ.2.60 కోట్లతో నిర్మిస్తున్న కెనాల్ రోడ్డుకు సోమవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శంకుస్థాపన చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

పిల్లల సమస్యల పరిష్కారానికే కమిటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి శ్రీదేవి

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ స్థాయిలో పిల్లల సమస్యలను గుర్తించి, పరిష్కరించడమే గ్రామ బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీల ఏర్పాటు లక్ష్యమని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి తోట శ్రీదేవి అన్నారు. సోమవారం బొమ్మూరులోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో ఆ కమిటీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి, మూడవ శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కమిటీ సమావేశాలు నిర్వహిస్తుందన్నారు. పిల్లల సమస్యలు గ్రామ స్థాయిలోనే పరిష్కారం కాని పక్షంలో, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి అనంత ప్రదీప్, లీగల్ కమ్ ప్రొటెక్షన్ అధికారి గౌరి, ప్రొటెక్షన్ ఆఫీసర్ క్రాంతిలాల్, చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ బి.రాజకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ మందిరంలో స్వామివారికి 108 రకాల వంటకాలతో నైవేద్యం



శ్రీకృష్ణ మందిరంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు మురళీకొండపై కొలువైన శ్రీకృష్ణమందిరంలో సోమవారం వైష్ణవ సాంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్వామివారికి 108 రకాల పిండివంటలు, 11 రకాల నైవేద్యాలు, 11 రకాల డ్రైఫ్రూట్స్, 11 రకాల పండ్లతో నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి, కోలాటం అలరించాయి. అనంతరం ఉట్టి ఉత్సవం ఉత్సాహంగా సాగింది.



గోవింద క్షేత్రంలో విశేష అలంకరణలో గోవిందుడు

భక్తిశ్రద్ధలతో శ్రీజయంతి

సీటీఆర్ఐ: తిరు నక్షత్రం సందర్భంగా గోవింద క్షేత్రంలో సోమవారం శ్రీకృష్ణ జయంతి (శ్రీజయంతి)ని ఘనంగా నిర్వహించారు. వైష్ణవ సంప్రదాయ ప్రకారం తిరునక్షత్రం రోజున స్వామి వారికి శ్రీజయంతిని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం 4 గంటలకు ఉట్టి ఉత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 40 అర్జీలు

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 40 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులను అడిషనల్ ఎస్పీ ఎంబీఎన్. మురళీకృష్ణ నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి, సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు.

21 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: అర్జీలకు గడువులోగా సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 21 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ (ఇన్‌చార్జి) రీటా, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, రెవిన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ మురళీకృష్ణ



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

సినిమాలు



శ్యామల	:	కిష్కింధపురి
సూర్యమినీ	:	ది కంజ్యూరింగ్, ఘాటీ
సూర్యప్యాలెస్	:	డిమోన్ స్లేయర్
స్వామి	:	మిరాయ్
అనుశ్రీ	:	మిరాయ్
శివజ్యోతి	:	కిష్కింధపురి
రాజా	:	మిరాయ్
ఊర్వశి	:	లిటిల్‌హార్ట్స్, మహావతార్ నరసింహ
మేనక	:	కిష్కింధపురి
రంభ	:	మిరాయ్
అప్సర	:	కొత్తలోక
అశోక	:	డిమోన్ స్లేయర్, మదరాసి
నామవరం		
వీఎస్ మహల్	:	మిరాయ్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మిరాయ్
కడియం		
వెంకటసూర్య	:	మిరాయ్

పలు సమస్యలపై కలెక్టరేట్‌లో వినతి పత్రాలు



డీఆర్‌ఓ సీతారామమూర్తికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ రూరల్ నాయకులు

సీటీఆర్ఐ: రూరల్ మండలంలోని గ్రామ పంచాయితీలకు 14 ఏళ్లుగా ఎన్నికలు జరగనందున, ప్రత్యేక అధికారి పాలనలో ప్రజలకు సరైన సేవలు అందడం లేదని రూరల్ నియోజక వర్గ బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తికి అసెంబ్లీ రూరల్ బీజేపీ కో కన్వీనర్ యానాపు ఏసు, జిల్లా ఉపాధ్యక్షుడు తనుబుద్ధి సూర్య భాస్కరరావు తదితరులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా పంచాయతీ పాలక వర్గాలు లేనందున కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు పూర్తి స్థాయిలో విడుదల కావడం లేదన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ డీఆర్‌ఓ సీతారామమూర్తికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

అనపర్తి: ఇంటర్మీడియట్‌లో ఇష్టపడి, కష్టపడి చదివితే భవిష్యత్తులో మంచి కోర్సులైన ఎన్ఐటీ, ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి కోర్సులకు సునాయాసంగా అర్హత సాధించి భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాల్లో స్థిరపడతారని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఎంఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. అనపర్తి జీబీఆర్ కళాశాలలో సోమవారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయనతో పాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ డాక్టర్ పి.త్రినాథ రాజా ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముందుగా కొత్తగా ఇంటర్మీడియట్‌లో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థులు పలు కళా ప్రదర్శనలు ప్రదర్శించి ఆహూతులను అలరించారు. ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు, ఇతర బహుమతులు, క్రీడల్లో ప్రావీణ్యం చూపిన విద్యార్థులకు పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అడ్వైజర్ జి.జగన్నాథరెడ్డి, డిగ్రీ డైరెక్టర్ డీవీఆర్‌ఏ పాపిరెడ్డి, కె.హరినాథ్ రెడ్డి, జూనియర్ కళాశాల డైరెక్టర్ మల్లిడి ఉమా వెంకట్‌రెడ్డి, జీబీఆర్ స్కూల్స్ డీన్ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

మేధ సాంకేతిక ఉత్సవం ప్రారంభం

రాజానగరం: శాస్త్ర, సాంకేతిక రంగాలలో వస్తున్న విప్లవాత్మక మార్పులను యువత ఆకళింపు చేసుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) అన్నారు. భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా క్యాంపస్‌లో సోమవారం నిర్వహించిన మేధ సాంకేతిక ఉత్సవాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సమాజాభివృద్ధిలో ఇంజినీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) మన జీవితాలలో అనేక అంశాలను మార్చగల సామర్థ్యం కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రొ. వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలల్లో ఫైలేరియా సర్వే



ఫైలేరియా సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కంబాలచెరువు: చున్నీలాల్‌జాజు నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల, సప్పా వారి వీధి ప్రాథమిక పాఠశాల, సంజీవ నగర్‌లోని ఆల్ప ప్రాథమికోన్నత పాఠశాలల్లో సోమవారం ఫైలేరియా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ మాట్లాడుతూ ఔషధ చికిత్సకు అంతరాయం కలిగిస్తుందో లేదో నిర్ధారించడానికి మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌కు ఈ ప్రామాణిక సర్వే నిర్వహించబడుతుందన్నారు. 6, 7 ఏళ్ల వయసు పిల్లల్లో ఫైలేరియా యాంటిజెన్‌లను గుర్తించడానికి ఈ టాస్ ఫైలేరియా రక్త పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమాన్ని రాష్ట్ర సహాయ మలేరియా అధికారి పార్వతీశం పర్యవేక్షించారు.

మంగారాణికి అభినందన



ప్రశంసాపత్రంతో ఉపాధ్యాయురాలు మంగారాణి

కంబాలచెరువు: గురు పూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మోటూరి మంగారాణిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు తమ విద్యాసంస్థల నుంచి ప్రశంసాపత్రం అందజేశారు. శేషారెడ్డి మాట్లాడుతూ విద్యా బోధనలో ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న మంగారాణి నేటి విద్యారంగానికి మార్గదర్శకులని కొనియాడారు.

మార్గాని సత్యనారాయణకు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కడియం: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా రాష్ట్ర రైతు తెలుగు ఉపాధ్యక్షుడు, కడియపులంక అపర్ణ సమేత అనంత ఈశ్వర హరిహర క్షేత్ర ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ నియమితులైన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లు పోలరాజు, ఆరేటి భద్రరావు, పెనుమాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు

కడియం: హెచ్ఐవీ/ఎయిడ్స్, మాదక ద్రవ్యాల నిరోధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోనసీమ సేవా మండలి సీఎస్‌సీ 2.0 రాజమండ్రి కో ఆర్డినేటర్ జి.రాజశేఖర్, సీహెచ్ఎస్ నాగమణి అన్నారు. ఈ మేరకు సోమవారం కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో విద్యార్థులకు అవగాహన కలిగించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వాటి బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్ఈ గోపీనాథ్ తదితరులు

ధవళేశ్వరం: గ్రామంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చూపిన మార్గంలో ఇంజినీర్లు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.